క్లుప్తంగా

అంగన్వాడీ పోస్టులకు రీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: జిల్లాలో అంగన్వాడీ పోస్టులకు రీ నోటిఫికేషన్‌ను వెంటనే భర్తీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఖాళీగా ఉన్న 12 అంగన్వాడీ కార్యకర్తలు, 400 ఆయా, 4 మినీ అంగన్వాడీ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్‌ను విడుదల చేయడం జరిగిందన్నారు. ఐసీడీఎస్ అధికారులు నిర్వహించే ఇంటర్వ్యూలు, మార్కులను పూర్తిగా రద్దు చేసి పదవ తరగతి మార్కుల ఆధారంగా, అదనపు మార్కుల అర్హతల ఆధారంగా ఎంపిక చేయాలన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాల పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు కేసీ బాదుల్లా, మునెయ్య, షరీఫ్, మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నగర వనంలో పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగర ప్రజలకు వినోదాన్ని, ఆహ్లాదకరమైన మంచి వాతావరణాన్ని అందిస్తున్న నగర వనానికి పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయాలని ఆర్‌సీపీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం నగర శివార్లలోని నగర వనంకు పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నాయకులు తస్లీమ్, వెంకటేష్, రవి గంగన్న పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో విద్యుత్ ఉద్యోగుల ఉద్యమనేత కిరణ్ 4వ వర్ధంతి సంస్మరణ సభ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సురేంద్రబాబు, నందీశ్వర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చౌడమ్మ ఆశ్రమంలో అన్నదానం



కడప కల్చరల్ : కడప నగరం కేంద్ర కారాగారం వద్దగల చౌడమ్మ వృద్ధాశ్రమంలో ఆదివారం స్థానిక శంకరాపురానికి చెందిన యోగి వేమన యోగా సెంటర్ సభ్యులు నిమ్మకాయల వెంకటలక్ష్మి, రామచంద్రారెడ్డిలు అన్నదానం చేశారు. తమ వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో పాలెం సత్యప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత అవసరం

కడప కల్చరల్ : విద్యార్థులకు భక్తితోపాటు విద్య కూడా అవసరమేనని యువ పారిశ్రామికవేత్త ఎస్‌బీ అహ్మద్‌బాష అన్నారు. స్థానిక నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రంలో హజరత్ బిలాల్ ఇంగ్లీషు మీడియం హైస్కూలు, హెచ్‌బీ మోడల్ స్కూలు సంయుక్తంగా నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాల్యం నుంచే విద్యార్థులకు నైతిక, మానవత విలువలను అలవాటు చేయాలని, అందుకు ఆధ్యాత్మికత అవసరమన్నారు. దాంతోపాటు నేటి తరంలో ఉపాధి కోసం ఆధునిక విద్యను తప్పక నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పదవ తరగతిలో ప్రతిభచూపిన విద్యార్థులను అభినందించారు. పాఠశాల కరస్పాండెంట్ షేక్ మహమ్మద్ నజీర్ అహ్మద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, పతకాలు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

శిల్పారామంలో సందడి



కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై మిస్పా మూవీ సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. సామాజిక అంశాలపై పలు కామెడి స్కిట్‌లను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఆలయాలలో విశేష పూజలు



చెన్నూరులో పోతులూరి అయ్యస్వామి గ్రామోత్సవం



జమ్మలమడుగులో కల్పవృక్ష వాహనంపై నారాపురస్వామి



చింతకొమ్మదిన్నెలో ప్రత్యేక పూజలందుకుంటున్న గంగమ్మతల్లి



కమలాపురంలో హారతి అందుకుంటున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చెన్నూరు : చెన్నూరులో యల్లమ్మ జాతరను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో వివిధ పూజలు చేపట్టారు. పోతులూరి అయ్యస్వామి ఊరేగింపు ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం సాయంత్రం చెన్నూరులోని ఆంజనేయస్వామి గుడి దగ్గర నుంచి పోతులూరి అయ్యస్వామిని ట్రాక్టర్‌పై ఊరేగించారు. ఊరేగింపు పార్క్‌వీధి నుంచి పాత బస్టాండ్ శివాలయం, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ మీదుగా కొనసాగింది. జాతరను డీఎస్పీ మహమ్మద్ షరీఫ్ పర్యవేక్షించారు. చెన్నూరు ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు. ఊరేగింపులో శాంతి కమిటీ సభ్యులు, పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. యల్లమ్మ జాతరలో భాగంగా నిర్వాహకులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు, వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి జాతర అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజల్లో పాల్గొ ని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, ఎంపీటీసీలు ముదిరెడ్డి సుబ్బారెడ్డి, ఎర్రసాని నిరంజన్‌రెడ్డి, దుంపనాగిరెడ్డి, గొర్ల పుల్లయ్య ఓబుల్‌రెడి, వైఎస్సార్ సీపీ నాయకులు ప్రసాద్‌బాబు, టిఎన్ చంద్రారెడ్డి, పాలగిరి ఉమామహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి విశేషపూజలు

చింతకొమ్మదిన్నె : కొత్తపేట-బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్య నిర్వహణ అధికారి సురేష్ కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. ఆలయ ఆవరణలోని బంధుమిత్రులతో విందుభోజనాలను ఆరగించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

కమలాపురం : మండల పరిధిలోని రామాపురంలో వెలసిన మోక్ష నారాయణస్వామి ఆలయంలో ఈనెల 3వతేదీ నుంచి జరుగుతున్న బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిసాయి. ప్రముఖ వేద పండితులు ఘనాపాటి వంశీకృష్ణ ఆచారత్వమున ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం మోక్ష నారాయణుడు గరుడ వాహనంపై, సుబ్రహ్మణ్యస్వామి మయూర వాహనంపై మా డ వీధులతో ఊరేగారు. నిర్వాహకులు సాయినాథశర్మ పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి తదితరులు స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు :

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 8 జతల కాండ్లు రాతి దూలాన్ని ఈడ్చాయి. గెలుపొందిన విజేతలకు వరుసగా రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు. రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేల నగదు బహుమతులను అందజేశారు.

కల్పవృక్ష వాహనంపై నారాపురస్వామి

జమ్మలమడుగు : నారపురస్వామి బ్రహోత్సవాలు కనులవిందుగా జరుగుతున్నాయి. భక్తులకు దేవదేవుడి ప్రతి రోజు ఒక అలంకారంతో దర్శనం ఇస్తూ కనువిందు చేస్తున్నారు. ఆదివారం ఉదయం కల్పవృక్ష వాహనంపై స్వామివారికి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు స్వామివారికి హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. మంగళవారం స్వామి వారికి కల్యాణోత్సవం బుధవారం ఉదయం రథోత్సవం నిర్వహించనున్నారు.

కమనీయం.. ఎల్లమ్మతల్లి జాతర



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితుడు

కడప కల్చరల్ : నగరంలోని 48వ డివిజన్ ఆచార్ల కాలనీలో శ్రీ రేణుకా ఎల్లమ్మ, జమదగ్ని మహర్షిల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఏటా జరిగే జాతర మహోత్సవంలో భాగంగా ఈ ఏడాది ఆదివారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కు విశేష పూజలు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి, పీఠంపై ఆశీనులను చేశారు. వేదపండితులు మంత్రోచ్చారణతో శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. ఆచార్ల కాలనీ, ఏఎస్ఆర్ నగర్, రామచంద్రారెడ్డి నగర్‌లతోపాటు కాలనీల ప్రజలు వచ్చి, కనులారా వీక్షించి ఆనంద పరవశం చెందారు. ఈ కార్యక్రమంలో కృష్ణమాచారి, గురువాచారి, కాలనీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం

చాపాడు : మండలంలోని అన్నవరం గ్రామం జెడ్పీ హైస్కూల్లో 1998-99 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 24 ఏళ్ల తర్వాత వీరంతా కలసి నాటి గురువులతో పాటు అప్పటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆత్మీయంగా పలకరించుకున్నారు.

ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానాల్లో గౌరవాన్ని పొందినప్పుడే గుర్తింపు లభిస్తుందన్నారు. అనంతరం గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు లక్ష్మీరెడ్డి, జయరామిరెడ్డి, నాగసుబ్బారెడ్డి, గౌస్, శ్రవణ్, అన్నమాచార్యులు, వెంకటరామిరెడ్డి, అన్నపూర్ణమ్మ దేవితోపాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాల నిర్వహణ, రుచికర వంటలు తయారు చేయించడంలో కీలకపాత్ర వహించిన నాగమునిరెడ్డి, దస్తగిరి, తస్లింభానులను అభినందించారు.

జాతీయ స్థాయి రోప్ జంప్ పోటీలకు కస్తూర్బా విద్యార్థులు

దువ్వూరు : మండల పరిధిలోని పుల్లారెడ్డిపేట కస్తూర్బాగాంధీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు సయ్యద్ షఫియా, నిహారిక జాతీయ స్థాయి రోప్ జంప్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రత్యేక అధికారి మల్లేశ్వరి ఆదివారం తెలిపారు. ఈ నెల 2, 3 తేదీల్లో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలోని భారతి విద్యామందిరంలో స్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో షఫియ గోల్డ్, నిహారిక సిల్వర్ మెడల్స్ సాధించారన్నారు. ఈనెల 20న మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో జరిగే జాతీయ స్థాయి జంప్ రోప్ పోటీల్లో పాల్గొంటారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థినులను పీఈటీ రమణమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

వైభవంగా మండెం నారసింహుడి కల్యాణం



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

చిన్నమండెం : మండెం లక్ష్మీనృసింహస్వామి వారి కల్యాణోత్సవం వైభవోపేతంగా నిర్వహించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామి వారికి కల్యాణాన్ని వేదపండితులు జరిపారు. సర్పంచ్ తిమ్మారెడ్డి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం జరగ్గా, అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రమణ, ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

మండెం లక్ష్మీనృసింహస్వామికి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డిలు ప్రత్యేక పూజలు చేశారు. మొలకల పౌర్ణమి సందర్భంగా నిర్వహిస్తున్న మండెం లక్ష్మీనృసింహస్వామి కల్యాణోత్సవం సందర్భంగా వారు ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన శ్రీకాంత్‌రెడ్డి, దేవనాథరెడ్డిలకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. పూజాది కార్యక్రమాలు జరిపి తీర్థప్రసాదాలు అందించి దుశ్శాలువాలతో సత్కరించారు. రూ.1.50 కోట్ల నిధులతో త్వరలో చేపట్టనున్న ఆలయ నిర్మాణ అభివృద్ధి పనులపై వారు అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ తిమ్మారెడ్డి, ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, రెడ్డన్న, ఎంపీటీసీ రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు జయశంకర్‌రెడ్డి, శేషారెడ్డి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చుక్కా అంజనప్ప, రామచంద్ర, సిద్దయ్య, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా గ్రామోత్సవం



ఇరుదేవేరులతో నరసింహస్వామి

పెనగలూరు : ఈటమాపురం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి తూర్పుపల్లెలో గ్రామోత్సవం జరిపారు. పంచాయతీలోని ఈటమాపురం, నాయుడువారిపల్లి, తూర్పుపల్లె గ్రామాలలో ఒక్కో రోజు ఒక్కో గ్రామం వంతున ఈనెల 10వ తేదీ వరకు గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా తూర్పుపల్లెలో అన్ని కులాల వారు కలిపి లక్ష్మీన రసింహస్వామి ఊరేగింపును బాణసంచా పేల్చుతూ మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలోని అన్ని కులాలవారు గ్రామోత్సవంలో పాల్గొన్నారు.

10న పుష్పయాగం : బ్రహ్మోత్సవాలలో భాగంగా 10వ తేదీన పుష్పయాగం చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బత్తిన తిరుపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్దగుండాల్ రెడ్డిలు తెలిపారు.

కొత్తపురమ్మా.. దీవించవమ్మా...



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సంబేపల్లె : దుద్యాల గ్రామ దేవతగా కొలువైన కొత్తపురమ్మ జాతర ఆదివారం వైభవంగా ప్రారంభమైంది. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు జరిపారు. సిద్దల నైవేద్యాన్ని అమ్మవారికి సమర్పించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలంకరణలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వచ్చిన భక్తులకు ఉత్సవ నిర్వాహకులు అన్నదానంతో పాటు తీర్థప్రసాదాలు అందజేశారు.

ముగిసిన గుట్టపల్లె జాతర

గుట్టపల్లె గ్రామంలో వెలిసిన వీరాంజనేయస్వామి జాతర ఆదివారంతో ముగిసింది. ఆలయ చైర్మన్ చిదంబర్‌రెడ్డి ఆధ్వర్యంలో జాతరను ఘనంగా జరిపారు. మొక్కుబడులు తీరిన భక్తులు చాందినీబండ్లు కట్టి, ఆలయం చుట్టూ ప్రదర్శనలు చేయించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

పుస్తక పఠన అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, గ్రంథాలయ సంస్థ అధికారులు

కడప కల్చరల్ : కడప నగరం కొండాయపల్లెలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని పలుచోట్ల విద్యార్థులు పుస్తక పఠన అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రంథాలయ సంస్థ ప్రతినిధులతో కలిసి వారు ఈ ర్యాలీ చేపట్టారు. వేసవి సెలవుల సందర్భంగా జిల్లాలోని 62 శాఖా గ్రంథాలయాలలో సోమవారం నుంచి జూన్ 11వ తేది వరకు వేసవి శిక్షణా శిబిరాలను నిర్వహిస్తుండడంతో వాటిని విజయవంతం చేయాలంటూ ఈ ర్యాలీ చేపట్టారు. కొండాయపల్లె, నెహ్రూనగర్ తోపాటు సమీపంలోని పలు వీధుల్లో విద్యార్థులు పుస్తక పఠనం మంచి అలవాటు అంటూ నినాదాలు చేస్తూ సాగారు.శిబిరానికి సంబంధించిన వివరాలు గల కరపత్రాలను ఇంటింటికి పంచి పెట్టారు. పిల్లలను వేసవి శిక్షణా శిబిరాలకు పంపాలని కోరారు. ర్యాలీలో సంస్థ కార్యదర్శి అమీరుద్దీన్, ఉప గ్రంథాలయ అధికారి పవన్‌కుమార్, సహాయ గ్రంథాలయ అధికారి నాదెండ్ల బాబ్జి, లైబ్రేరియన్లు సురేష్, సుబ్రమణ్యం, జేమ్స్, సిబ్బంది రాంప్రతాప్, సుబ్బమ్మ, హరి, రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు శిబిరం ప్రారంభం..

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించనున్న విద్యార్థుల వేసవి శిక్షణా శిబిరాన్ని సోమవారం ఉదయం 8 గంటలకు సంస్థ జిల్లా చైర్ పర్సన్ లింగాల ఉషారాణి ప్రారంభించనున్నట్లు కార్యదర్శి అమీరుద్దీన్ తెలిపారు. శిబిరంలో కథలు చదవడం, వినడం, రాయడం, కథలు, ఇతర పుస్తకాలు చదవడం, వాటిపై సమీక్షలు రాయడం, అతిథుల ప్రసంగాలు, వ్యక్తిత్వ వికాస శిక్షణ , చిత్రలేఖనం, నృత్యం, స్పోకెన్ ఇంగ్లీషు తదితర అంశాలలో శిక్షణ ఇస్తారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లా వ్యాప్తంగా వివిధ పంటలు దెబ్బతిని జిల్లా రైతాంగం కష్టాల పాలైందని, ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలన్న ఉద్దేశ్యంతో సోమవారం ఉదయం కలెక్టరేట్ ఎదురుగా రైతులతో కలిసి శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యల్లారెడ్డి తెలిపారు. బీజేపీ ఎం ఆధ్వర్యంలో జరిగే ఈ ధర్నాకు బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు వంగల శశిభూషణ్‌రెడ్డి, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్‌రెడ్డి, రాష్ట్ర స్థాయి నాయకులు పాల్గొంటారన్నారు.

నేడు జాన్ హెండ్రీ డ్యూనాంట్ జయంతి

కడప కల్చరల్ : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వ్యవస్థాపకులు జాన్ హెండ్రీ డ్యూనాంట్ జయంతి వేడుకలను సోమవారం కడప నగరంలోని మట్టిపెద్దపులి వీధివద్దగల రెడ్‌క్రాస్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సంస్థ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజ తెలిపారు. ఉదయం 9.00 గంటలకు కార్యాలయంలో సంస్థ వ్యవస్థాపకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించనున్నట్లు తెలిపారు. ఉదయం 10.00 గంటలకు మరియాపురం వద్దగల ఎస్టీ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థులకు ఉచితంగా బ్లడ్ గ్రూపింగ్ క్యాంపు నిర్వహిస్తామన్నారు. సంస్థ స్పెషల్ ఆఫీసర్ సి.సాయిగ్రేస్ ముఖ్య అతిథిగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రక్తదానం చేయదలిచిన వారు స్వచ్ఛందంగా సంస్థ కార్యాలయానికి రావాలని ఆయన సూచించారు.

విశ్వకవి ఠాగూర్‌కు ఘన నివాళి



ఠాగూర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

కడప ఎడ్యుకేషన్: భారతదేశానికి జాతీయ గీతాన్ని అందించిన గొప్ప మానవతావాది రవీంద్రనాథ్‌ఠాగూర్ అని పెన్షనర్ల సంఘం జిల్లా కార్యదర్శి రామమూర్తినాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి అన్నారు. విశ్వకవి రవీంద్రనాథ్‌ఠాగూర్ జయంతిని ఆదివారం కడప పెన్షనర్ల సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు నారాయణరెడ్డి, రాముడు, నాగయ్య, నారాయణ, పలువురు నాయకులు, రాయల్ రసీద్ పాల్గొన్నారు.

దూదేకుల సంఘానికి స్థలం మంజూరు చేయాలి



మేయర్ సురేష్‌బాబుకు వినతి పత్రం సమర్పిస్తున్న దూదేకుల సంఘ నాయకులు

కడప కార్పొరేషన్: దూదేకుల సంఘానికి స్థలం కేటాయించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాదుల్లా కోరారు. ఆదివారం డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కడప మేయర్ కె. సురేష్ బాబులకు వినతి పత్రాలు సమర్పించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో దూదేకుల సోదరులు 1.50 లక్షల మంది ఉన్నారని, వారికి జిల్లా కేంద్రంలో కమ్యూనిటీ హాల్, కబరస్థాన్‌కు స్థలం మంజూరు చేయాలన్నారు. దీనిపై వెంటనే స్పందించిన వారు కలెక్టర్, కడప తహసీల్దార్‌లకు ఫోన్ చేసి మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు పి. ఓబులేసు, జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయప్ప, అలీబాషా, ఖాదరయ్య, సుభాన్, బాబయ్య, దస్తగిరి, రహీం, పీరమ్మ, రెడ్డెయ్య పాల్గొన్నారు.

గంగమ్మకు పూజలు

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు మండలంలోని రాఘవరాజుపురం పంచాయతీలోని కాపుపల్లెలో ఆదివారం గంగమ్మకు గ్రామస్తులు ఘనంగా పొంగుబాలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, పుల్లంపేట ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డిలు హాజరై గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెట్పీటీసీ రత్నమ్మ పాల్గొన్నారు.

మున్సిపల్ విద్యార్థులకు అభినందన

కడప కార్పొరేషన్: పదవ తరగతి ఫలితాల్లో మున్సిపల్ ఉర్దూ బాలుర పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని మేయర్ కె. సురేష్ బాబు అన్నారు. శనివారం రాత్రి మున్సిపల్ స్కూల్ విద్యార్థి షేక్ ఓవైసీ 572 మార్కులు సాధించారని, ఆరుగురు విద్యార్థులు 550కిపైగా, 11 మంది విద్యార్థులు 500లకు పైగా మార్కులు సాధించారన్నారు. భవిష్యత్‌లో వారంతా మరింత బాగా చదివి గురువులకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. రాబోవు రోజుల్లో కార్పొరేట్ పాఠశాలలకంటే ధీటుగా మున్సిపల్ పాఠశాలలను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో 25వ డివిజన్ కార్పొరేటర్ కె. సూర్యనారాయణ రావు, ఉపాధ్యాయులు ఇలియాస్, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక పాఠశాలల్లో 60.93 శాతం ఉత్తీర్ణత

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ పరిధిలోని మున్సిపల్, జెడ్పీ, ఎయిడెడ్ పాఠశాలల్లో పదవ తరగతిలో విద్యార్థులు 60.93 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 28 పాఠశాలల్లో 1638 విద్యార్థులకుగాను 998 మంది విద్యార్థులు పాస్ అయ్యారు. వీరిలో 127 మంది విద్యార్థులు 500లకుపైగా మార్కులు సాధించగా, 606 మంది ఫెయిల్ అయ్యారు. సాలె నాగయ్య వీధిలోని మున్సిపల్ ఉర్దూ హైస్కూల్‌లో అత్యధికంగా 91.89 శాతం ఉత్తీర్ణత సాధించగా, 89.13 శాతం ఉత్తీర్ణతతో కాగితాల పెంట జెడ్పీ ఉర్దూ హైస్కూల్, 86.36 శాతంతో నకాష్ ఉర్దూ మున్సిపల్ హైస్కూల్, 75 శాతంతో చెమ్ముమియ్యాపేట బాలికల జెడ్పీ హైస్కూల్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.